క్లుప్తంగా

నేటి నుంచి దెందులూరులో ప్రజా ఆశీర్వాద యాత్ర

దెందులూరు: మండలంలో గురువారం నుంచి ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి ప్రజా ఆశీర్వాద పాదయాత్ర ప్రారంభమవుతుందని వైఎస్సార్ సీపీ దెందులూరు మండలాధ్యక్షుడు కామిరెడ్డి నాని తెలిపారు. 21వ తేదీన మధ్యాహ్నం 3 గంటలకు మేదినరావుపాలెంలోకి పాదయాత్ర చేరుకుంటుందన్నారు. సాయంత్రం 5 గంటలవరకు పాదయాత్ర జరుగుతుందని, 5.30 గంటలకు శ్రీరామవరం గ్రామంలోకి పాదయాత్ర ప్రవేశిస్తుందని. రాత్రి 8 గంటల వరకు పాదయాత్ర కొనసాగుతుందన్నారు. 22న ఉదయం 8.30 గంటల నుంచి 11.30గంటల వరకు దెందులూరులో పాదయాత్ర జరుగుతుందన్నారు. 11.30 గంటల నుంచి దెందులూరు హైస్కూల్ గ్రౌండ్‌లో ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి పుట్టినరోజు వేడుకలు జరుగుతాయన్నారు. సాయంత్రం 3 గంటలనుంచి రాత్రి 9 గంటల వరకు దెందులూరు గ్రామంలో పాదయాత్ర జరుగుతుందని, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని నాని కోరారు.

నేడు చేబ్రోలుకు ఎంపీ శ్రీధర్, ఎమ్మెల్యే వాసుబాబు రాక

ఉంగుటూరు: చేబ్రోలు గ్రామానికి గురువారం ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్, ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు విచ్చేయనున్నారని వైఎస్సార్ సీపీ గ్రామ నాయకుడు ఆకుల రాజ తెలిపారు. ఉదయం 9 గంటలకు రూ.46.60 లక్షల వ్యయంతో నిర్మించిన సచివాలయం 1 భవనాన్ని ఎమ్మెల్యే వాసుబాబు ప్రారంభిస్తారని, 10 గంటలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా ఏర్పాటు చేసిన నియోజకవర్గ స్థాయి రక్తదాన శిబిరాన్ని ఎంపీ కోటగిరి శ్రీధర్ ప్రారంభిస్తారని, 11 గంటలకు రూ.30 లక్షలు వ్యయంతో నిర్మించిన వాటర్ ట్యాంకును, మధ్యాహ్నం 12 గంటలకు రూ.20 లక్షల వ్యయంతో నిర్మించిన కార్మిల్ కాన్వెంట్ సీసీ రహదారిని ఎంపీ ప్రారంభిస్తారని, అలాగే పంచాయతీ పారిశుధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

గ్రంథాలయాన్ని వినియోగించుకోవాలి



నారాయణపురం ఎస్ఏఎస్ కళాశాలలో గ్రంథాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వాసుబాబు

ఉంగుటూరు: కళాశాల గ్రంథాలయాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు కోరారు. బుధవారం కళాశాలలో రూ.2 లక్షల వ్యయంతో 7,500 పుస్తకాలు, పూర్తిగా కంప్యూటరైజ్డ్ చేసిన గ్రంథాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రంథాలయాభివృద్ధికి సహకరించిన దాతలను అభినందించారు. 4 వేల పుస్తకాలు ఉండే గ్రంథాలయాన్ని 7,500కు పెంచారు. ఒకేసారి 75మంది విద్యార్థులు చదువుకునేలా ఏర్పాట్లు చేశారు. లార్జ్ స్కేల్ కో ఆపరేటివ్ సొసైటీ చైర్మెన్ యెలిశెట్టి పాపారావు బాబ్జి రూ.1.50 లక్షలను గ్రంథాలయం అభివృద్ధికిఅందజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ టీకే విశ్వేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పాపారావు బాబ్జి, డైరెక్టర్లు దాసరి సత్యనారాయణ, సురే ఏడుకొండలు, సెక్రటరీ యర్రా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గ్యాస్ సిలిండర్ పేలి తాటాకిల్లు దగ్ధం

పెదవేగి : ఇంట్లో వంట చేస్తుండగా ప్రమాదవశాత్తూ గ్యాస్ లీకై తాటాకిల్లు పూర్తిగా దగ్ధమైన సంఘటన పెదవేగి మండలం గార్లమడుగు పంచాయతీ వెంకటకృష్ణాపురం సమీపంలోని గుమ్మడిగుంటలో బుధవారం రాత్రి జరిగింది. గొటుకుల పార్థసారధి తల్లి వరలక్ష్మి గ్యాస్ స్టౌపై వంట చేస్తుండగా ఒక్కసారిగా మంటలు వ్యాపించి ఇంటి పైకప్పుకు అంటుకున్నాయి. దీంతో ఆమె ఇంట్లో ఉన్న మనవరాలిని తీసుకుని భయంతో బయటకు పరుగులు తీసింది. అనంతరం నిమిషాల వ్యవధిలోనే గ్యాస్ సిలిండర్ పెద్ద శబ్దంతో పేలిపోయింది. పెదవేగి తహసీల్దారు ఎస్.నాగరాజు వీఆర్వోను సంఘటనా స్థలానికి పంపి వివరాలు సేకరించారు.

జగనన్న పాలనలోనే పేదలకు న్యాయం

- ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు
- మొయ్యేరులో గడప గడపకు మన ప్రభుత్వం



మహిళకు సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే వాసుబాబు

గణపవరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలోనే పేదలకు నూరుశాతం న్యాయం జరిగిందని, ఇలాంటి సంక్షేమ పాలన దేశంలో మరెక్కడా లేదని ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు చెప్పారు. బుధవారం గణపవరం మండలం మొయ్యేరులో 225వ రోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏనాడూ సంపన్నుల గురించి తప్ప పేదల గురించి ఆలోచించని చంద్రబాబు ఇప్పుడు పేదల జపం చేస్తున్నారని విమర్శించారు. సంక్షేమ పథకాలను ఎలాంటి సిఫార్సులు, లంచాలు లేకుండా నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు జమ చేసిన ఘనత తమ ప్రభుత్వానిదేనన్నారు. అభివృద్ధి సంక్షేమం రెండు కళ్లుగా రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్లామన్నారు. జగన్ పాలనలోనే అన్ని వర్గాల ప్రజలకు మేలు చేకూరిందన్నారు.వైఎస్ జగన్‌ను మళ్లీ అధికారంలోకి తీసుకురావాలన్న కోరిక రాష్ట్ర ప్రజలందరిలో కనిపిస్తోందని, అందుకే చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లు దొంగ పొత్తులు పెట్టుకుని ప్రజలను మోసం చేయడానికి పన్నాగాలు పన్నుతున్నారన్నారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ తిరిగి నాలుగున్నరేళ్ల కాలంలో ప్రతి కుటుంబానికి అందిన లబ్ధిని వివరించారు. గ్రామంలో చేసిన అభివృద్ధి పనులు తెలియజెప్పారు. మరోసారి జగన్‌కు అధికారం ఇస్తే రాష్ట్రంలో పేదరికం అనేది ఉండదని, ప్రతి ఒక్కరూ ఎవరి కాళ్లపై వారు నిలబగలిగేలా ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. మహిళలకు సంక్షేమ పథకాల బ్రోచర్లు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ దుళ్ల కుటుంబరావు, ఎంపీటీసీ సభ్యురాలు ద్వారంపూడి విజయలక్ష్మి, పార్టీ గ్రామ అధ్యక్షుడు గంటా పద్మాజీ రావు, ఆర్‌బీకే చైర్మన్ ద్వారంపూడి ఆదిరెడ్డి, సొసైటీ చైర్మన్ ఈదర అశోక చక్రవర్తి, సచివాలయ కన్వీనర్ పొన్నా కనకదుర్గ, పార్టీ నాయకులు మాకా శ్రీను, ఇంటూరి పాపయ్య, పొట్ల గాబ్రియేలు, వెంకట్రాజపురం సర్పంచ్ మల్లంపల్లి సురేష్ పాల్గొన్నారు.

ప్రజల కష్టాలను తెలుసుకునేందుకే..



వేగివాడలో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి

- 7వ రోజుకు చేరిన ఎమ్మెల్యే కొఠారు ప్రజా ఆశీర్వాద పాదయాత్ర
- పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహం

పెదవేగి : రాజన్న.. జగనన్నల స్ఫూర్తితో ప్రజల కష్టసుఖాలను తెలుసుకునేందుకే 'ప్రజా ఆశీర్వాద పాదయాత్ర' చేస్తున్నానని దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి తెలిపారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యే ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ యాత్ర 7వ రోజు బుధవారం ఉదయం తాళ్ల గోకవరంలో అశేష జనకోలాహలం మధ్య ప్రారంభమైంది. దారిలో ఉన్న తాళ్ల గోకవరం ప్రాథమిక పాఠశాలను సందర్శించి చిన్నారులతో కాసేపు గడిపిన ఎమ్మెల్యే అనంతరం గ్రామ వీధుల్లో ప్రజలతో మమేకమై ముందుకు సాగారు. తాళ్ల గోకవరంలో రూ.40 లక్షల నిధులతో నిర్మించిన సీసీ రోడ్లను, రూ.10 లక్షలతో నిర్మించిన మల్టీ పర్పస్ యాక్టివిటీ సెంటర్‌ను అలాగే కమ్యూనిటీ హాల్ ను ఎమ్మెల్యే స్థానిక నాయకులతో కలసి ప్రారంభించారు. అనంతరం వేగివాడ గ్రామానికి చేరగా, గ్రామస్తులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. మహిళలతో ముచ్చటిస్తూ సమస్యలు తెలుసుకుంటూ పాదయాత్ర ముందుకు సాగింది. ఈ సందర్భంగా గ్రామంలోని 36 మందికి ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. సీఎం జగన్, ఎమ్మెల్యేల జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని తలపెట్టిన మెగా వైద్యం శిబిరం పోస్టర్‌ను జెడ్పీ చైర్మన్ ఘంటా పద్మశ్రీతో కలసి ఎమ్మెల్యే ఆవిష్కరించారు. భోజనం విరామం తరువాత సాయంత్రం చక్రాయిగూడెం, సీతారామపురం మీదుగా రాత్రి ముందూరుకు భారీగా తరలి వచ్చిన ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలతో ఎమ్మెల్యే చేరుకున్నారు. గ్రామంలో కొంత మేర యాత్ర నిర్వహించి, బస ప్రాంతానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి మాట్లాడుతూ దెందులూరు నియోజకవర్గంలో 13,800 మంది పేదలకు ఇళ్ల స్థలాలు అందించిన విషయాన్ని ప్రజలకు గుర్తుచేశారు. రూ.500 కోట్లతో పులివెందుల తరువాత నియోజకవర్గంలో రోడ్లను అభివృద్ధి చేసింది తమ ప్రభుత్వమేనని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో 50 వేల మెజార్టీతో విజయం సాధించి, జగనన్నకు బహుమతిగా ఇవ్వాలని కార్యకర్తల్లో నూతన ఉత్సాహాన్ని ఎమ్మెల్యే నింపారు. మొదటి విడతగా 100 కిలో మీటర్లు, దాదాపు 23 గ్రామాలు తిరిగి, రాత్రి సమయాల్లో సైతం గ్రామాల్లో బస చేసి, ప్రజల కష్టాలు మరింతగా తెలుసుకుంటూ వాటిని పరిష్కరిస్తున్నానని అబ్బయ్యచౌదరి చెప్పారు. జెడ్పీ చైర్మన్ పద్మశ్రీ మాట్లాడుతూ నాలుగున్నరేళ్ల సీఎం వైఎస్ జగన్‌మహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రంలో రూ.4,4,69,000 కోట్ల సంక్షేమ లబ్ధిని పేద, మధ్య తరగతి ప్రజలకు అందించారని గుర్తు చేశారు. సీఎం జగన్ స్ఫూర్తితో 100 రోజులపాటు ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి చేస్తున్న పాదయాత్రకు అనూహ్య స్పందన లభించిందన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ అప్పన కనకదుర్గ ప్రసాద్, జెడ్పీ వైస్ చైర్మన్ పెనుమాల విజయ్‌బాబు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, సొసైటీ అధ్యక్షులు, పార్టీ మండలాల అధ్యక్షులు, సచివాలయ కన్వీనర్లు, నాయకులు పాల్గొన్నారు.

అన్ని వర్గాలకు అండగా నిలిచాం



తాళ్ల గోకవరంలో పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కొఠారు, నాయకులు

పెదవేగి: సంక్షేమం, అభివృద్ధితో అన్నివర్గాలకు అండగా నిలిచామని పెదవేగి ఎంపీపీ తాతా రమ్య అన్నారు. బుధవారం మండలంలోని తాళ్ల గోకవరంలో 'వై ఏపీ నీడ్స్ జగన్'' కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి హాజరయ్యారు. ముందుగా ఎంపీపీ ఆధ్వర్యాన వైఎస్సార్ సీపీ నాయకులు పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి మాట్లాడుతూ ఈ నాలుగున్నరేళ్లలో పరిపాలనా సంస్కరణలు, వినూత్న కార్యక్రమాల ద్వారా దేశమంతా ప్రశంసించేలా రాష్ట్రం సాధించిన పురోభివృద్ధిని అందరికీ క్షుణ్ణంగా తెలియజెప్పాలన్నారు. తొలుత సంక్షేమ పథకాల ఫ్లెక్సీని ఎమ్మెల్యే, ఎంపీపీ ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు జానంపేట బాబు, ముందూరు సొసైటీ చైర్మన్ చెరుకూరి ప్రసాద్, గుత్తా ప్రసాద్, ఈఓఆర్డీ శ్రీనివాసులు, మేడికొండ కృష్ణారావు, సచివాలయ కన్వీనర్‌లు, నాయకులు, కార్యకర్తలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శన

భీమడోలు: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం నిర్వహించిన మండల స్థాయి సైన్స్ ఫెయిర్ ఆకట్టుకుంది. మండల పరిధిలోని భీమడోలు, గుండుగొలను, పూళ్ల, ఎంఎంపురం, పోలసానిపల్లి, ఆగడాలలంక, కురెళ్లగూడెం ఉన్నత పాఠశాలలకు చెందిన 8, 9, 10వ తరగతుల విద్యార్థులు తమ ఉపాధ్యాయుల పర్యవేక్షణలో రూపొందించిన వివిధ ప్రాజెక్టులను ప్రదర్శించారు. ఎగ్జిబిషన్‌ను ఎంఈవో 1 ఈదుపల్లి శ్రీనివాసరావు ప్రారంభించారు. ఉత్తమ ప్రదర్శనలను జిల్లాస్థాయి పోటీలకు పంపనున్నట్లు ఎంఈవో తెలిపారు. హెచ్ఎం బి.శ్రీనివాసరావు, టీచర్లు పాల్గొన్నారు.

పెదపాడులో..

పెదపాడు: వర్కింగ్ మోడల్స్ ఆధారంగా కృత్యాధార బోధనకు సైన్స్ ఉపాధ్యాయులు ప్రాధాన్యత ఇవ్వాలని పెదపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పి.వెంకటేశ్వరరావు కోరారు. పెదపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం మండల స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శన జరిగింది. విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టు నమూనాలు ఆకట్టుకున్నాయి.

విద్యార్థులకు ట్యాబ్‌లు సిద్ధం

నేడు పంపిణీకి ఏర్పాట్లు



ట్యాబ్‌లను పరిశీలిస్తున్న ఎంఈవో అయినపర్తి భాస్కర్‌కుమార్

భీమడోలు: రాష్ట్ర ప్రభుత్వం విద్యా సంస్కరణల్లో భాగంగా సర్కారీ బడుల్లో చదువుకుంటున్న 8వ తరగతి బాలబాలికలకు ట్యాబ్‌లను ఈ నెల 21వ తేదీ గురువారం రాష్ట్ర ముఖ్యమంత్రి సీఎం వైఎస్ జగన్‌మోహనరెడ్డి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని అందజేసేందుకు విద్యాశాఖ అన్ని ఏర్పాట్లు చేసింది. గతేడాది నుంచి విద్యార్థులకు ట్యాబ్‌లు అందించే బృహత్తర పథకాన్ని ప్రభుత్వం ప్రారంభించింది. ఈ నేపథ్యంలో బైజూస్ కంటెంట్ మేరకు వారికి పాఠ్యాంశాలను బోధిస్తున్నారు. ఆ చిన్నారులకు పాఠ్యాంశాలపై పట్టు సాధించేందుకు ఈ విధానం సత్ఫలితాలిస్తోంది. ప్రభుత్వ బడుల్లోని చిన్నారుల్లో ఆయా సబ్జెక్టులపై మేథోశక్తి పెరిగేందుకు దోహదపడే ఈ విధానాన్ని ప్రభుత్వం ఈ ఏడాది కొనసాగిస్తుంది. మండలంలోని భీమడోలు, గుండుగొలను, పూళ్ల, పోలసానిపల్లి, ఆగడాలలంక, ఎంఎంపురం, కురెళ్లగూడెం ఉన్నత పాఠశాలల్లో 659 మంది 8వ తరగతి చదువుకుంటున్నారు. కాకినాడలోని ఆర్‌జేడీ కార్యాలయం నుంచి ట్యాబ్‌లను మండలానికి భీమడోలు ఎంఈవో 2 అయినపర్తి భాస్కర్‌కుమార్ బుధవారం రాత్రి తీసుకువచ్చారు. తొలి విడతగా మండలానికి 290 ట్యాబ్‌లను ఉన్నతాధికారులు అందించగా పంపిణీకి సిద్ధంగా ఉంచారు. ఈ నెల 21వ తేదీ గురువారం మధ్యాహ్నం ఒంటి గంటకు ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు చేతుల మీదుగా బాలబాలికలకు అందజేస్తామని ఎంఈవో 1, 2లు ఈదుపల్లి శ్రీనివాసరావు, అయినపర్తి భాస్కర్‌కుమార్ తెలిపారు.

ఎమ్మెల్యేకు రుణపడి ఉంటా..

దెందులూరు: వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శిగా సున్నా ఫణీంద్రను నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం ఆదేశాలు జారీ చేసిన సంగతి తెలిసిందే. బుధవారం పోతునూరు శివారు ఉండ్రాజవరంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ గ్రామ సర్పంచ్ బోదుల స్వరూప్, ఎంపీటీసీ సున్నా నరేష్, సొసైటీ చైర్మన్ రమాదేవి డీఎన్‌వీడీ ప్రసాద్ (బజ్జీ), ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరిలకు రుణపడి ఉంటానన్నారు. తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తానని చెప్పారు.

సచివాలయ వ్యవస్థతో సంక్షేమ పాలన



ఉంగుటూరులో సచివాలయం-2 భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు

ఉంగుటూరు: సామాన్య ప్రజానీకానికి సంక్షేమ పథకాలను త్వరితగతిన అందించడంలో సచివాలయాలు ఎంతగానో దోహదపడుతున్నాయని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. మండలంలో పలు గ్రామాల్లో సుమారు రూ.2.70 కోట్లతో నిర్మించిన గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్సార్ ఆరోగ్య కేంద్రం, మల్టీ పర్పస్ హాళ్లను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గడిచిన నాలుగున్నరేళ్లలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం గ్రామాల అభివృద్ధిలో భాగంగా వివిధ శాశ్వత భవనాల నిర్మాణం చేపట్టి అందరికీ అందుబాటులోకి తెచ్చినట్లు చెప్పారు. ఆయా కార్యక్రమాల్లో వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు మరడ మంగారావు, జెడ్పీటీసీ కొరిపల్లి జయలక్ష్మి, ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి, పార్టీ పంచాయతీ రాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడు పుప్పాల గోపి, సొసైటీ అధ్యక్షుడు పాపారావు బాబ్జి, తహసీల్దార్ వెంకటరమణ, ఎంపీడీవో ప్రేమాన్విత, పంచాయతీ రాజ్ డీఈ ఉప్పలపాడు శ్రీనివాస్, సర్పంచ్ వస్కు కుమార్ రాజా, ఉప సర్పంచ్ నాగు, సొసైటీ అధ్యక్షుడు శేషగిరి, సర్పంచ్ ఏలేటి సునీత, ఎంపీటీసీ సభ్యుడు పెనుగొండ బాలకృష్ణ, సర్పంచ్ బండారు సింధు, ఉప సర్పంచ్ జగదీష్, సర్పంచ్ సదలవాడ రాజేంద్ర. ఎంపీటీసీ సూర్యలక్ష్మికొండలు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

నేడు సీఎం జగన్ పుట్టినరోజు వేడుకలు

గణపవరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టినరోజు పురస్కరించుకుని గురువారం ఉంగుటూరు నియోజకవర్గ వ్యాప్తంగా వైఎస్సార్ సీపీ శ్రేణులు సేవా కార్యక్రమాలు నిర్వహించాలని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ ప్రతినిధి సుభాష్ సూచించారు. అలాగే పలు కార్యక్రమాల్లో ఎమ్మెల్యే వాసుబాబు పాల్గొంటారన్నారు. వైఎస్ఆర్ విగ్రహాలకు పూలమాలలు వేయడం, పేదలకు బట్టల పంపిణీ, రక్తదానం తదితర కార్యక్రమాలను చేపట్టాలన్నారు.

ఉంగుటూరు నియోజకవర్గంలో..

భీమడోలు: ఉంగుటూరు నియోజకవర్గంలో గురువారం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టినరోజును పురస్కరించుకుని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు పలు అభివృద్ధి, సామాజిక సేవ కార్యక్రమాలు చేపట్టడంతో పాటు విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ చేస్తారని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ ప్రతినిధి ఎ.రవి బుధవారం రాత్రి తెలిపారు. భవిత స్కూలులో విద్యార్థులకు స్వెట్టర్లు అందిస్తామని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ రావిపాటి సత్యశ్రీనివాస్, మండల ప్రధాన కార్యదర్శి రామకుర్తి నాగేశ్వరరావు తెలిపారు.